ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం 5 మార్చి 2025



# 'వటపత్రశయనుడు...హంసవాహనునిగా... శ్రీ లక్ష్మీ నరసింహుడు!!



## ఉదయం వటపత్రశాయిగా.. సాయంత్రం హంసవాహనపై విహారం

## నాలుగో రోజుకు చేరిన యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు

**"వటపత్రశాయికి వరహాల లాలీ
రాజీవ నేత్రునికి రతనాల లాలీ
మురిపాల కృష్ణుడికి ముత్యాల లాలీ**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:
జగమేలు స్వామికి పగడాల లాలీ" అంటూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు మంగళవారం వటపత్ర శ్రయనుడిగా దర్శనం ఇస్తున్న వేళ ఆలయ విద్వాంసులు... సన్నాయి మేళాల వారు మృదు మధురంగా వీనుల విందుగా పాటను వినిపిస్తుండగా శ్రీవారి సేవ కొనసాగింది. సృష్టికి ముందు లోకాలన్నిటినీ తన పొట్టలోనే ఉంచుకొని ఏమి తెలియని సాధారణ వ్యక్తిలా వటపత్రంలో శయనించి ఉండే విష్ణుమూర్తి లీలలను యాదగిరిగుట్టలో వటపత్రశాయి అలంకార సేవ ద్వారా సాక్షాత్కారింపచేసిన వైనం భక్తులను పరవశింపజేసింది"

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజు మంగళవారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో దర్శనమిచ్చిన స్వామివారు, రాత్రి హంస వాహనంపై ప్రధానాలయ తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. మర్రి ఆకుపై స్వామిఅమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ తిరువీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శనమిచ్చే ఘట్టాన్ని ఆలయ అర్చకులు వైభవోపేతంగా జరిపించారు. అనంతరం తూర్పు రాజగోపురం ఎదుట స్వామివారిని ప్రత్యేక వేదికపై అధిష్టింపజేసి వటపత్రశాయి అవతార విశిష్టతను భక్తులకు ప్రవచించారు. 'మహాప్రళయ కాలంలో సమస్త లోకాలు నీటిమయం అయిన సందర్భంలో.. జగద్రక్షకుడైన భగవానుడు ప్రళయకాల అనంతరం సమస్త లోకాలను తన పొట్టలో దాచుకుని మర్రి ఆకుపై పడుకొని త్రిభంగి స్వరూపుడై జీవకోటిని కటాక్షించే' వటపత్రశాయి ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. వటపత్రశాయిగా ఆలయ మాడవీధుల్లో విహరించిన స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తరించారు.


వటపత్ర శాయి అలంకార సేవ ముందు కూచిపూడి నృత్యాలు అభినయించిన కళాకారులతో ఈవో ఏపూరి భాస్కర్ రావు..


హంస వాహనంలో పాల్గొన్న రోమింగ్ న్యూస్ చీఫ్ ఎడిటర్ గొట్టిపర్తి భాస్కర్, ఎస్.పీ.ఎఫ్ పోలీసు అధికారి తాళ్ల శ్రీనివాస్ రెడ్డి.


శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి మంగళవారం జరిగిన వటపత్ర శాయి అలంకారం, హంస వాహన తిరువీధి సేవ

## వైభవంగా హంస వాహన సేవ

బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంత్రం స్వామివారికి నిత్యారాధనలు ముగిసిన అనంతరం.. రాత్రి 8:30 గంటలకు ప్రధానాలయ ప్రాంగణంలో స్వామివారి హంస వాహన సేవను ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారిని అందంగా ముస్తాబు చేసిన అర్చకులు, హంస వాహనంపై అధిష్టింపజేసి ప్రధానాలయ మాడవీధుల్లో విహరింపజేశారు. హంస వాహనంపై ఊరేగిన స్వామివారిని భక్తులు దర్శించుకుని తరించారు. తూర్పు ద్వారం వద్ద స్వామివారిని అధిష్టింపజేసి హంస వాహన సేవ విశిష్టతను భక్తులకు ప్రవచించారు. హంస జ్ఞానానికి ప్రతీక అని, జ్ఞానం పరమాత్మ స్వరూపమని భక్తులకు వివరించారు. సమస్త ప్రాణకోటిలోని అహాన్ని తొలగించి దాసోహం అనే భావాన్ని కలిగించడానికి స్వామివారు హంసవాహనధారుడై భక్తులకు దర్శనమిస్తాడని వివరించారు. హంస వాహన దర్శనంతో మంచి నడవడిక, మంచి జ్ఞానం కలుగునని, అహంకారం తొలగి సద్గుణ సంపత్తి వృద్ధి చెందుతుందని ప్రవచించారు. ఈ వేడుకల్లో యాదగిరిగుట్ట టెంపుల్ చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భాస్కర్ రావు, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, ఏఈవో గజవెల్లి రఘు, రమేష్ బాబు, నవీన్ తదితరులు ఉన్నారు.

## నేడు శ్రీకృష్ణాలంకారం, పొన్నవాహన సేవ

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజు బుధవారం శ్రీకృష్ణ అలంకారం(మురళీకృష్ణుడు), పొన్నవాహన సేవను నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణ అలంకారంలో స్వామివారిని ఊరేగించి, రాత్రి 8:30 గంటలకు పొన్నవాహనంపై విహరింపజేయనున్నారు.



హంస వాహన సేవలో రోమింగ్ న్యూస్ చీఫ్ ఎడిటర్ గొట్టిపర్తి భాస్కర్, ఎస్.వీ.ఎన్ ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురి


హంస వాహన తిరువీధి సేవ


ఆకట్టుకున్న మాధవపెద్ది సత్యం బృందం వారు ఆలపించిన సంకీర్తనలు.


హంస వాహన వైభవాన్ని వివరిస్తున్న దేవస్థానం ప్రధాన అర్చకులు నల్లన్ దిగల్ లక్ష్మీ నరసింహ చార్యులు... పాల్గొన్న అనువంశిక ధర్మకర్త బి నరసింహమూర్తి రోమింగ్ న్యూస్ చీఫ్ ఎడిటర్ గొట్టిపర్తి భాస్కర్, మాధురి దంపతులు.


ఆలయంలోని యాగశాలలో హవనం నిర్వహిస్తున్న అర్చకులు.


ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం





